క్లుప్తంగా

30 లోగా పక్కాగృహాల దరఖాస్తుకు అవకాశం

వీరబల్లి : మండల ప్రజలు పక్కా గృహాలకు తమ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఈ ఎం.వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు తమ అర్జీలను సచివాలయంలో ఈనెల 30వ తేదీలోగా అందజేయాలని కోరారు.

ముగిసిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శనివారంతో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ముగిశాయి. గత ఐదు రోజులుగా వివిధ రంగాలలో ప్రతిభ చూపినవారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆరు రకాల పోటీలలో 12 మంది విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. విజేతలకు ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలత బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు ఉచిత మెడికల్ కిట్లు

గాలివీడు : శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వామి మాలధారులకు ఉచితంగా మెడికల్ కిట్లు అందజేయనున్నట్లు అమీన్ మెడికల్స్ వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు మెడికల్ కిట్లను అందజేస్తున్నామన్నారు. మెడికల్ కిట్లు అవసరమైన వారు 9440853785 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అర్హులకు ఇళ్లు మంజూరు

గాలివీడు : మండలంలోని అర్హులందరూ ఇళ్లకు ఈనెల 30 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జవహర్ బాబు, హౌసింగ్ ఏఈ రమేష్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తుదారులు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డ్, బ్యాంకు పాసు బుక్, రేషన్ కార్డు అందించాలని కోరారు.

సన్మార్గం వైపు నడిపించేందుకే అయ్యప్ప దీక్ష



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

గాలివీడు : కఠిన నియమ నిష్టలతో సన్మార్గం వైపు నడిపించేందుకే అయ్యప్ప స్వామి మండల దీక్షలు చేపడతారని గురుస్వామి రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి గోపనపల్లె మార్గంలోని సబ్ స్టేషన్ వద్ద జ్యువెలరీ దుకాణదారుడు రామాంజులు ఏర్పాటు చేసిన పడిపూజలో అయ్యప్ప స్వామి మాలధారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి నామస్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది మాలధారులకు భిక్షను ఏర్పాటు చేశారు.

రేపు శ్రీ సద్గురు దర్బార్ సాయి నగర్‌లో వన భోజనం

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట దర్గా వద్ద కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా వనభోజన కార్యక్రమం జరుగుతుందని ఆయన కమిటీ సభ్యులు సత్యమయ్య స్వామీజీ, శంకరయ్య స్వామీజీలు తెలిపారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి దర్గాలోని సాయిబాబా మందిరంలో దర్గాస్వామీజీ, మాతాజీల విగ్రహాలకు అభిషేకం అనంతరం వేద పండితులచే పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం వనభోజన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్



ఆర్‌డీఎస్ఎస్ ఫీడర్ ప్రారంభిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్యానాయక్

సిద్దవటం : ప్రజలకు త్రీ ఫేసులో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సిద్దవటంలోని 33/11కేవీ ఉపకేంద్రం నుంచి 11 కేవీ వెంకటాయపల్లె ఆర్‌డీఎస్ఎస్ ఫీడర్‌ను ప్రారంభించామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్యానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ అవసరాలకు, పరిశ్రమల స్థాపనకు 24 గంటలు విద్యుత్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(కన్‌స్ట్రక్షన్)నాగరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సిద్దవటం విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచు.. ప్రమాదపుటంచు

జాగ్రత్తలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం



రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై దట్టమైన పొగమంచులో సాగుతున్న వాహనాల రాకపోకలు

రాజంపేట టౌన్ : చలితీవ్రత రోజు, రోజుకు పెరుగుతోంది. అదే సమయంలో మంచు కూడా కురుస్తోంది. దీంతో ఉదయం 7 గంటల వరకు పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలను మంచుదుప్పటి కప్పేస్తోంది. అందువల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరికి వచ్చినంత వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. మంచు కురుస్తున్న కారణంగా వాహనాలను నెమ్మదిగా నడపాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మంచు తీవ్రత ఎక్కువగా ఉంటే మంచు తగ్గేవరకు వాహనాలను ఖాళీ ప్రదేశాల్లో పెట్టుకుంటే మంచిదని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాలు ఎందుకు జరుగుతాయంటే..

- దట్టంగా అలుముకున్న మంచు వల్ల వాహనదారులకు దారి సరిగా కనిపించక పోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- రహదారి సరిగా కనిపించకున్నా వాహనాన్ని వేగంగా నడపడం వల్ల
- రహదారి కనిపించడం లేదని వాహనాలను రోడ్డులోనే నిలిపివేయడం వల్ల
- డ్రైవర్‌కు సరైన నిద్ర లేకపోవడం దీనికి తోడు మంచు కారణంగా రోడ్డు సరిగా కనిపించని కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- దట్టమైన మంచు కురిసే సమయంలో వీలైనంత వరకు వాహనాలను నడపకుండా ఉంటే మంచిది. మార్గమధ్యంలో మంచు తీవ్రత పెరిగితే సురక్షితమైన ప్రాంతంలో వాహనాన్ని పార్కింగ్ చేయడం మంచిది.
- మంచు కురిసే సమయంలో వాహనాలను నెమ్మదిగా నడపడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనదారులు గుర్తించేలా వాహనాల హెడ్ లైట్స్ ఆన్ ఆఫ్ చేస్తూ ఉండాలి
- మంచు కురుస్తున్నా తప్పనిసరిగా ప్రయాణించాల్సిన పాలు, న్యూస్‌పేపర్ తరలించే రవాణా వాహనాలకు, వ్యవసాయ కూలీలను తరలించే ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు విధిగా ముందు, వెనకవైపు రేడియం స్టిక్కర్లు అతికించాలి.
- వాహనానికి అమర్చే రెడ్‌సిగ్నల్స్, బ్రేక్ సిగ్నల్స్ సరిగా పనిచేస్తున్నాయా లేదా అని ముందుగా సరిచూసుకోవడం మంచిది. ఎందుకంటే రహదారి మలుపుల్లో ఈ లైట్స్ ఎదుటివారిని అప్రమత్తం చేస్తాయి.
- మంచు కురిసే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎదురుగా వెళ్లే వాహనాన్ని అధిగమించే ప్రయత్నం చేయకూడదు.
- మంచు కురిసే సమయంలో రహదారులు తడిగా ఉంటాయి. అందువల్ల ద్విచక్ర వాహనదారులు సడన్‌గా బ్రేక్‌వేస్తే జారిపడే అవకాశం ఉంటుంది. నెమ్మదిగా వెళితే సడన్ బ్రేక్ వేసినా ప్రమాదం నుంచి బయటపడవచ్చు.

కూటమి నేతలకు పదవుల మీదే ధ్యాస

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమి నేతలు బోలెడు మంది ఉన్నా పదవులు తెచ్చుకునేందుకే శ్రద్ధ చూపుతున్నారు తప్ప నిధులు తెచ్చేందుకు ప్రయత్నించడం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు అందించిన విషయం మరచిపోలేమన్నారు. కేవలం చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్ కోసం అదానీతో ఒప్పందాల విషయం తెచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచిన సంగతిని ప్రజలు తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్ధాల పుట్టగా ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉందన్నారు. చంద్రబాబు క్షుద్రరాజకీయాలను ఎన్నో ఏళ్లుగా ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో గుణపాఠం తప్పదన్నారు.

కటారుకు కన్నీటి వీడ్కోలు



కటారు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, పలు పార్టీల నేతలు

రాజంపేట : సింగిల్‌విండోమాజీ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ప్రముఖ న్యాయవాది కటారు సుబ్బరామిరెడ్డి(70)కు శనివారం కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు జరిగాయి. హైదరాబాదు నుంచి భౌతికకాయం శుక్రవారం రాత్రి స్వగ్రామానికి చేరుకోవడంతో పలుపార్టీల నేతలు వచ్చి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శనివారం జరిగిన అంత్యక్రియల్లో పలువురు నేతలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ తనయుడు కొండూరు అజయ్‌రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సోదరుడు భూమన శివశంకర్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, కబడ్డీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, జనసేన నియోజకవర్గ నేతలు యల్లటూరు శ్రీనివాసరాజు, యల్లటూరు శివరామరాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, కౌన్సిలర్లు, ప్రముఖులు, పలువురు న్యాయవాదులు, అధికారులు, అంత్యక్రియలకు హాజరై నివాళులు అర్పించారు.

పోస్టాఫీసులో డిజిటల్ ఖాతాలు ప్రారంభం



కొత్తగా ఖాతా తెరిచేందుకు బారులు తీరిన ప్రజలు

రాయచోటి టౌన్ : రెండు వందల రూపాయలు చెల్లిస్తే పోస్టాఫీసులో డిజిటల్ ఖాతా తెరుస్తామని రాయచోటి సబ్ డివిజన్ పోస్టల్ అధికారి అమరనాథ్ తెలిపారు. శనివారం రాయచోటి పోస్టాఫీస్ కార్యాలయంలో ఎన్‌పీసీఐ డిజిటల్ అకౌంట్ కోసం బారులు తీరిన మహిళలకు సూచనలు – సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల కోసం త్వరలో మున్సిపల్ కమిషనర్ సహకారంతో రాయచోటి పట్టణంలోనే కాకుండా రూరల్ పరిధిలోని అన్ని వార్డు, గ్రామ పంచాయితీలలో ఖాతాలు (డిజిటలైజేషన్ లేని) వారికి పోస్టాఫీస్ ద్వారా కొత్త ఖాతా తెరుస్తున్నామని చెప్పారు. ప్రజలకు పోస్టల్ సేవలు మరింత చేరువ చేసే క్రమంలో పోస్టల్ బ్యాంకింగ్‌ను కూడా పరిచయం చేస్తున్నామన్నారు. పోస్టాఫీస్ ద్వారా బ్యాంక్ ఖాతా తెరిస్తే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) డిజిటల్ పేమెంట్స్ జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు సంబంధించిన డబ్బులు నేరుగా మీ ఖాతాలో జమ అవుతాయన్నారు. ఖాతా తెరవాలనుకొనే వారు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, రూ.200 డబ్బు తీసుకురావాలని సూచించారు. అమ్మకు వందనం, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, రైతు భరోసా, పీఎం కిసాన్‌లకు సంబంధించిన పథకాల ద్వారా వచ్చే నగదు కూడా ఈ ఖాతా ద్వారానే పొందవచ్చన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

రాజంపేట టౌన్ : మహారాష్ట్రలో బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంతో స్థానిక భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిప్రసాద్, పాపయ్య, వీవీ.రమణ, పి.సూర్యచంద్ర, డాక్టర్ వేణుప్రసాద్, తోట నగేష్, సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో...

నందలూరు : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అద్భుత విజయం సాధించడంతో స్థానిక బీజేపీ నాయకులు శనివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. అరవపల్లెలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద టపాసులు పేల్చి మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు షబ్బీర్ అహ్మద్, గిరిజన మోర్చా నాయకుడు మస్తానయ్య, బీసీ నాయకుడు హిమగిరి యాదవ్, మండల అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని ఆపాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం ట్రూ అప్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోపనున్న భారాన్ని వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో పలు ప్రజా సంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.17 వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపుతుండడం దుర్మార్గమన్నారు. టీడీపీ, జనసేనలు ప్రతిపక్షంలో ఉండగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపును తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నేతలు అదాని, షిర్డీసాయి సంస్థలతో కుమ్మక్కై వేలాది కోట్ల రూపాయల ముడుపులు పుచ్చుకుని మీటర్ల బిగింపు ప్రక్రియను చేపడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, సుధీర్ మార్, వంగిమళ్ళ రంగారెడ్డి, ఎస్.శ్రీనివాసులు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోలు మణితో పాటు పలుసంఘాల నేతలు పాల్గొన్నారు.

డిసెంబర్ 4న విజయవాడలో ప్రజా హక్కుల సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకులు

గాలివీడు : ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిసెంబర్ 4న విజయవాడ జింఖానా మైదానంలో ప్రజా హక్కుల సభను నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ తెలిపారు. శనివారం గాలివీడులోని నాలుగురోడ్ల కూడలి వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసే లేదని, ఉద్యోగభృతి, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు, వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం అని దగా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 31లోపు ప్రీమియం చెల్లించాలి

బద్వేలు ఏడీఏ నాగరాజ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బద్వేలు ఏడీఏ నాగరాజ

సిద్దవటం : రైతులు వరి పంటకు డిసెంబర్ 31 లోపు ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకుడు నాగరాజ తెలిపారు. సిద్దవటంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం మండలంలోని 10 రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల సాగు ప్రణాళిక, ఉత్పాదక సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ– పంట నమోదు ప్రక్రియ ఈనెల 25 నుంచి క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతుందన్నారు. పీఎం కిసాన్ లబ్ధి పొందిన రైతులు ఎన్.పి.సి.ఐ. మ్యాపింగ్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

విద్యార్థులు కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ, ఎన్ఐఏ న్యూఢిల్లీకి చెందిన కె. అచ్చినాయుడు

రాయచోటి టౌన్ : చదువు పూర్తి కాగానే ఉద్యోగాలకు వెళ్లే విద్యార్థులు ప్రధానంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఏసీపీ, ఎన్ఐఏ న్యూఢిల్లీకి చెందిన కె. అచ్చినాయుడు సూచించారు. శనివారం రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యంతో పాటు రాయచోటి రోటరీ క్లబ్ వారు సంయుక్తంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు పూర్తి అయ్యేలోగా ప్రతి విద్యార్థి జనరల్ ఇంగ్లీష్, రీజనింగ్, ఆప్టిట్యూడ్, సింపుల్ మ్యాథ్‌మాటిక్స్, జనరల్‌నాలెడ్జ్ వంటి అంశాలపై పట్టు సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, రోటరీ క్లబ్ సభ్యుడు విశ్వజవహర్, సెక్రటరీ శశిశేఖర్, కోశాధికారి మహేష్ రాజు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



సిద్దవటం పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

సిద్దవటం : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌ను శనివా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఇసుకను మాత్రం ఆయా గ్రామాల పరిధిలో గృహ అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం, ఒంటిమిట్ట ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ 53లో హద్దులు ఏర్పాటు



హద్దుల కోసం సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం : వెలుగుపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో సర్వే నంబర్ 53లో రామాలయం నిర్మాణానికి 20 సెంట్లు కేటాయించడంతో శనివారం రెవెన్యూ సిబ్బంది హద్దులను ఏర్పాటు చేసినట్లు వీఆర్ఓ కేశవులు, సర్వేయర్ పురుషోత్తం రెడ్డి తెలిపారు. రామాలయానికి 20 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించగా కొంత మంది ఆ స్థలాన్ని ఆక్రమించారని గ్రామస్తులు తహసీల్దార్ మాధవీలతకు ఫిర్యాదు చేశారన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వెలుగుపల్లె ఎస్సీ కాలనీలో సర్వే నిర్వహించామన్నారు. ఆక్రమణకు గురైన ప్రదేశాలను తొలగించి 20 సెంట్ల స్థలానికి హద్దులను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆడపిల్లలపై అఘాయిత్యాలు అరికట్టాలి



మంటపంపల్లి జెడ్పీ హైస్కూలులో బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ఒంటిమిట్ట : దేశంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని రెడ్స్ ఎన్జీఓ సంస్థ స్టాఫ్ కో–ఆర్డినేటర్ రవి, సీఎస్‌డబ్ల్యు సిద్దార్థ కోరారు. రెడ్స్ ఎన్జీఓ సంస్థ చిల్డ్రన్స్ డే మహోత్సవాలలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మండలంలోని ఒంటిమిట్ట, మంటపంపల్లి గ్రామాల్లో ఉన్న జెడ్పీ హైస్కూళ్లలో చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగృహాలకు దరఖాస్తు

రామాపురం : అర్హులైన లబ్ధిదారులు ఈనెల 25 నుంచి పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఏఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు హౌసింగ్ పథకం క్రింద ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి ఆన్‌లైన్ కాని వారు అలాగే గ్రామాల్లో సొంత స్థలం ఉన్నవారు పీఎంఏవై 2.0 స్కీం కింద దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు, దంపతుల ఆధార్‌కార్డులు, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ప్రధానమంత్రి జనధన్ బ్యాంక్ ఖాతా జిరాక్సులు జత చేయాలన్నారు.

సచివాలయాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సూర్యప్రకాష్

సంబేపల్లె : మండల పరిధిలోని గ్రామ సచివాలయాలను శనివారం అన్నమయ్య జిల్లా సంక్షేమ బీసీ వెల్ఫేర్ అధికారి సూర్యప్రకాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిపల్లె, మోటకట్ల, సంబేపల్లె, రౌతుకుంట, దేవపట్ల గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

ఘనంగా దీప దుర్గపూజ



దీప దుర్గా పూజ చేస్తున్న పూజారి

చిట్వేలి : శ్రీ భువనేశ్వరీ శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం దీప దుర్గ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అష్టోత్తర నామాలతో కుంకుమార్చన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. ఈ పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి సురేంద్ర స్వామి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువ గొట్టివీడు విద్యార్థులు

గాలివీడు : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువగొట్టివీడు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు బాలగంగాధర్ నాయుడు, కె.శివ ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో 9 వ తరగతి చదువుతున్న తమ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు జె.వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలను అరికడదాం

రైల్వేకోడూరు అర్బన్ : బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శనివారం ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమన్నారు. బాలికలకు విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, సుబ్బలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

వీరబల్లి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, నర్సులకు పలు సూచనలు చేశారు. అలాగే ఆసుపత్రి రికార్డులను, మందులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణు, డాక్టర్ జియావుల్లా, సీహెచ్ఓ సుధాకర్, శివయ్య, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలి

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎందరో పేద విద్యార్థులు కళాశాలలో చదువుకుంటున్నారని వీరందరికీ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అలాగే ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణ, లతీఫ్, ఆదర్శ్, విక్రమ్, పవన్, జగన్, అభినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన

పెనగలూరు : పెనగలూరు మోడల్ స్కూల్ ఒకేషనల్ విద్యార్థులకు శనివారం పరిశ్రమలపై ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీతోపాటు ఒకేషనల్ ఉపాధ్యాయులు, ఎంపీడీఓ విజయారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతకల్ డీఆర్‌యూసీసీ సభ్యుడిగా వేణుగోపాల్ రెడ్డి



రాజంపేట : గుంతకల్ డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడిగా రాజంపేట మండలం, మందరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువ నాయకుడు తంబళ్ల వేణుగోపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన రాజంపేట రైల్వే స్టేషన్ మేనేజర్‌తో సమావేశమయ్యారు. రాజంపేట రైల్వే స్టేషన్‌లో సమస్యల పరిష్కారం కోసం ఎంపీలు మేడా రఘునాథరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాజంపేట, నందలూరు, ఓబులవారిపల్లి రైల్వే స్టేషన్లలో పలు రైలు హాల్టింగ్స్‌పై దృష్టి సారిస్తామన్నారు. తనను డీఆర్‌యూసీసీ సభ్యుడిగా నియమించినందుకు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.